గమ్యస్థానం

రాజమండ్రి స్టేషనులో కలకత్తా మెయిలు వచ్చి ఆగింది. ప్లాట్‌ఫారం అంతా దిగేవారితోను, ఎక్కేవారితోనూ చాలా కోలాహలంగా ఉంది. సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులోంచి దిగి, విశ్వనాథం ఒక చేత్తో సంచీ పుచ్చుకొని, స్టేషను బయటికి వచ్చాడు. ఎండ బాగా మాడ్చేస్తోంది. ఒకసారి వాచీ తీసి చూసుకున్నాడు. పన్నెండు గంటలు కావస్తోంది. ఒక సైకిలు రిక్షా ఎక్కి పడవలరేవుకి పొమ్మన్నాడు.

లాంచి అప్పుడే రేవు దాటి వెళ్లిపోయింది. ఇంకా రెండుగంటలు గడపాలి కదా అని వరదా రావు హోటల్‌కి వెళ్లి కొంచెం ఫలహారం చేసి, ఒక సిగరెట్టు పాకెట్టు కొనుక్కొని రేవుదగ్గిరకు వచ్చాడు. అక్కడ ఒక రావిచెట్టుక్రింద విశ్రాంతి తీసుకుందామని, సంచీ ప్రక్కన పెట్టుకుని కూర్చున్నాడు. సాఫీగా ఒకసిగరెట్టు వెలిగించి తాపీగా ఆలోచించసాగాడు.

విశ్వనాథంది అమలాపురం. వయస్సు సుమారు ముప్ఫయిరెండు ఉంటుంది. తండ్రి బాగా ఉన్నవాడే. రెండువందల ఎకరాల మాగాణీ ఉంది. పదిహేనుఏళ్ల క్రితం తన స్వగ్రామం వదలి మద్రాసు వచ్చేశాడు. ఇప్పుడు ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తనపైన ముగ్గురు అన్నలు, ఇద్దరు అక్కయ్యలు ఉన్నారు. అన్నలెవ్వరూ కాలేజీ చదువులు చదవలేదు. తండ్రితోపాటు సేద్యం చేస్తున్నారు. అక్కయ్యలిద్దరికీ తన చిన్నప్పుడే పెళ్లి అయిపోయింది.

విశ్వనాథం మద్రాసులో బియ్యే ఫస్టు ఇయర్ చదువుతుండగా తన పెళ్లి నిశ్చయమైంది. అదీ తనఇష్టానికి వ్యతిరేకంగా. మద్రాసులో కొంచెం పలుకుబడి ఉన్న తన చుట్టం ఒకాయన కూతురి మీద తనకు మనసుకలిగింది. తను ప్రయ

గంటి సూర్యప్రకాశరావు

త్నిస్తే ఆమెతో వివాహంఅయ్యేదేమో. కాని తండ్రికి ఎదురుచెప్పటానికి సాహసించలేకపోయాడు.

రేవుదగ్గరకి లాంచి పెద్దరొదతోవచ్చి ఆగింది. దాంతో విశ్వనాథం ఆలోచనలకి బ్రేకుపడింది. క్యాబిన్‌కి టికెట్టు తీసుకొన్నాడు, లాంచిలో తలుపుదగ్గిర గుమ్మంపై కూర్చున్నాడు. కొంచెంసేపయినతర్వాత లాంచి కదిలింది. చూస్తూఉండగానే రేవు బాగా దూరమైంది.

విశ్వనాథం ఒకసారి గోదావరివైపు చూశాడు. నీళ్లు పోతపోసిన బంగారంలా మెరిసిపోతున్నాయి. అక్కడక్కడ చేపలు కుప్పిగంతులు వేస్తున్నాయి. విశ్వనాథం ఆలోచనలు సుడిగుండాలవలె తిరుగుతున్నాయి. ఒకదానికీ, ఒకదానికీ సంబంధం లేదు. ఒకవైపు, ఇన్నేళ్ళతర్వాత తన వాళ్ళను కలుసుకోబోతున్నాంగదా అని ఒక వింతసంతోషం. రెండోప్రక్క మేలుకున్న గతస్మృతులు పెట్టే కలవరం.

విశ్వనాథం తన పెళ్లినిగూర్చి ఆలోచించసాగాడు. ఆ పెళ్ళిజరిగిన వారంరోజులలో తనుపడ్డఅవస్థకు తానే ఆశ్చర్యపడుతున్నాడు ఇప్పుడు. కాని ఆనాడు తన సన్నిహితులనుకున్నవారంతా కత్తికట్టినట్టు వ్యవహరించారు. ఆనాటిపరిస్థితులకు తాను లోబడినందుకు, తనజీవితంఎలామారిపోయిందో తలుచుకుంటే, ఆ వేదనఇంకా ఎక్కువ అవసాగింది. తండ్రి అధికారం, తల్లి కన్నీళ్లు అక్కయ్యల అర్థంలేని ఉపశమనాలతో, తన పెళ్ళి ముక్కాముల కాపురస్థులు, సూరన్నగారి కుమార్తె, శాంతితో పెద్దల సమక్షాన వైభవంగా జరిగింది. అందులో తాను ఒకనిమిత్తమాత్రుడు అన్నట్లుగా సంచరించాడు. కాని తను పడిన ఆవేదన, తాను ఆశించిన అమ్మాయి తనకు కాకపోవటం అన్నీ కలిసి తన్ని బాగా కృంగదీశాయి.



తెలుగుభాషా సమితి నవలల పోటీలో బహుమతిపొందిన "అన్వేషణ" నవల రచయిత శ్రీ పొత్తూరి సాంబశివరావు సమితి ఆధ్వర్యాన గతమాసం విజయవాడలో జరిగిన ఉత్సవంలో లోక్ సభస్పీకరు శ్రీ ఎమ్. అనంతశయనంఅయ్యంగార్ నుంచి బహుమతి స్వీకరిస్తున్న దృశ్యం.

★ గమ్యస్థానం ★

శోభనపు గదిలో జాలిగొలిపే చూపులు ప్రసరిస్తున్న కాంత; కాటుక పెట్టుకున్నందుకేమో, మరీ ఆకర్షణీయంగా కనిపించే నేత్రాలు, 'తల్లీ నువ్వు నాకు మాతృసమానురాలవు. నన్ను పిరికివాని క్రింద జమకట్టినా సరే, నీకూ నాకూ ఎటువంటి సంబంధమూ ఉండబోదు' అని తను కఠినంగా పలికిన పలుకులు, ఆమర్నాడే ఎవ్వరికీ చెప్పకుండా తను మద్రాసుకి వచ్చేయటం, అంతా ఒక సినిమారీలులా విశ్వనాథం మెదడులో మెలగింది

మద్రాసులో హోటలు భోజనం, ఆఫీసుకి దగ్గరలోనే కుదుర్చుకున్న తనరూము... ఏదో ఇన్నేళ్ళు ఒంటరిగానే కాలం గడిపాడు. మొదట్లో తను ఎప్పటికైనా నిర్ణయం మార్చుకుంటాడేమో అని తన తండ్రి, మామగారు ఉత్తరాలు వ్రాసేవారు. కాని వాటి కన్నిటికీ ఒకటే సమాధానం—మౌనం. వాళ్ళకీ విసుగెత్తిందేమో—కొన్నేళ్ళయిన తర్వాత, ఆ ఉత్తరాలు వ్రాయడం కూడా మానేశారు.

బొబ్బర్లంక రేవును లాంచి సమీపించింది. ప్రయాణీకులు బస్సు ఎక్కడ తప్పిపోతుందో అన్నట్లు కంగారుగా సామానులు పట్టుకొని ఎప్పుడు గట్టు చేరుతామా అన్నట్లు ఆత్రంగా నిల్చుని చూడసాగారు. ఆ కోలాహలంలో గతంలో విహరిస్తున్న విశ్వనాథం వాస్తవ ప్రపంచంలోకి ఊడిపడ్డాడు. ప్రయాణీకుల త్రోపిడి ఆగేవరకు నిలబడి విశ్వనాథం మెల్లిగా బస్సు స్టాండుకి చేరుకున్నాడు. మొదట రెండు బస్సులలో ఖాళీలేదు. మూడో బస్సు అప్పుడే వచ్చింది కాబోలు, అందులో డ్రైవరు ప్రక్కన ఫ్రంట్ సీటులో కూర్చున్నాడు. కండక్టరు రాగానే, అమలాపురానికి టికెట్టు పుచ్చుకొన్నాడు. కొంత సేపటికి బస్సుకూడా కదిలింది. విశ్వనాథం రోడ్డువైపు చూశాడు. తారురోడ్డు నీలంగా మెరిసిపోతోంది.

విశ్వనాథం ఆలోచన తన స్వగృహం మీదికి మళ్ళింది. తన తల్లిని, తండ్రిని చూసి చాలా ఏళ్ళయింది. తను మద్రాసు వచ్చేసిన తర్వాత, ఉత్తరాలతోనే, వాళ్ళ క్షేమసమాచారాలు తెలుస్తూ ఉండేవి. 'ఇప్పుడు బాగా ముసలివాళ్ళయిపోయుంటారు,' అనుకున్నాడు.

బస్సు ఓబలంకదగ్గిఱ ఆగింది. ప్రయాణీకులంతా కాఫీ ఫలహారాలు చేయడానికి దిగుతున్నారు. విశ్వనాథం తన సీటులోనే కూర్చుని సిగరెట్టు వెలిగించి ఏదో ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఎవ్వరో ఇద్దరు బస్సు దగ్గరికి రావడం చూశాడు. భార్యాభర్తలు కాబోలు, ఆ అమ్మాయిని కొంచెం పరిశీలించి చూశాడు. వెంటనే ముఖం అవతలవైపుకి త్రిప్పి ఆలోచించసాగాడు. ఆ అమ్మాయిని చూడగానే, విశ్వనాథానికి తను మనసుగొన్న మద్రాసు అమ్మాయిలా కనిపించింది. ఇదే ఇంతవరకయితే తను ఎంతో ఆనందం, ఆందోళన కనపర్చి ఉండేవాడు. ఇప్పుడు ఆ తలపు వచ్చినా, శూన్యంలో ఆలోచిస్తున్నట్లే ఉంది.

ఆ పెద్దమనిషి విశ్వనాథం ప్రక్కనే కూర్చున్నాడు. ఆయనే పల్కరిద్దామా, వద్దా అని ముందు కొంచెం శంకించినా, చివరికి "ఏ ఊరు వెళ్తున్నారండీ" అని మాటవరసకి అడిగాడు. విశ్వనాథం అప్రయత్నంగా "ముక్కామల" అని చెప్పాడు. కాని వెంటనే నాలిక కరచుకున్నాడు. తను అలా ఎందుకు చెప్పాడు? తను వచ్చినా అక్కడకు వెళ్ళడుగదా! దాని అధ్యాయం ఏనాడో పూర్తిఅయిపోయింది. అని సర్దుకుని "క్షమించండి. అమలాపురమే వెళ్తున్నాను" అని ఆ పెద్దమనిషికేసి తన లోటుపాట్లు ఏమైనా గమనించాడా అని చూశాడు. పొరపాటు ఎవ్వరికైనా సహజంలే అన్నట్లు ఆయన ఓ పత్రిక తీసి చదువుకుంటూ ఉన్నాడు.

ప్రయాణీకులంతా తిరిగి ఎక్కిన తర్వాత బస్సు బయలుదేరింది. విశ్వనాథం ఎంత వద్దనుకున్నా అతని ఆలోచన ముక్కామల మీదికే మళ్ళింది. తన మామగారిల్లు... ఇంటిలోపల పెద్దమండువా ఆమండువా ఒక్కటే తనకుబాగా గుర్తుకు వస్తోంది. మిగతా పరిసరప్రాంతం తనకు అంతగా గుర్తుకురావటంలేదు. ఇప్పుడు ఆ ప్రాంతం అంతా ఎలా వుంటుందో కొంచెం ఊహించుకోసాగాడు. కాంత పెద్దకళ్లు కాటుక పెట్టుకొంటే మరీపెద్దగాకనిపిస్తాయి. అవి తనకు గుర్తుకువచ్చేవి. 'ఇంతకన్నా ఎక్కువ ఆలోచించకూడదు' అన్నట్లుగా విశ్వనాథం ఒక్కనిట్టూర్పు వదిలాడు.

బస్సు కొత్తపేటదాటి పలివెల వంతెన దగ్గర మలుపు తిరిగింది. విశ్వనాథం కాలవ అవతలిగట్టువైపు చూడసాగాడు. అప్పటికి బాగా చల్లబడింది. సూర్యుని కిరణాలు కొబ్బరి ఆకులచాటునుంచి దోబూచులాడుతున్నాయి. ఇంతలో అవతలిగట్టున ఒక పల్లకీ ఎదురయింది. కొత్త పెళ్ళికొడుకు కాబోలు చాలా ఉత్సాహంగా కూర్చున్నాడు. విశ్వనాథం ఆదృశ్యం చూసీచూడనట్టు కాలువవైపు చూడసాగాడు.

బస్సు ముక్కామల సమీపిస్తోంది. విశ్వనాథం గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. బస్సు ముక్కామలదగ్గర ఆగింది. విశ్వనాథానికిబాగా దాహం వేసినట్లయింది. ఒకసోడా త్రాగుదామని దిగి కిళ్లీకొట్టు దగ్గరికి వెళ్ళాడు. సోడా త్రాగినతర్వాత తన సీటుదగ్గిరకివచ్చి సంచీ తీసుకొన్నాడు. ప్రక్కసీటులోని పెద్దమనిషి ఏదో అడుగుతున్నా వినిపించుకోకుండా వంతెన వైపు దారితీశాడు. బీడీ వెలిగించి తాపీగాబస్సులోకి ఎక్కుతున్న కండక్టరు 'ఇదేమిటి ఈయన ఇక్కడే దిగిపోయాడే, అనివిస్తుపోయి చూశాడు.

★